# విలీన ప్రక్రియ వేగవంతం.!

**-జిహెచ్ఎంసిలో మున్సిపాలిటీల విలీనానికి కసరత్తు**
**-హద్దులు నిర్ధారణ, అధికారాల విభజనపై అధ్యయనం**
**-సర్కిళ్లు, డివిజన్లు ఎన్ని పెరుగుతాయని లెక్కలు**




**హైదరాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) విస్తరణకు 27 మున్సిపాలిటీలను జీహెచ్ ఎంసీలో విలీనానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.. ఔటర్‌ను ఆనుకోని ఉన్న పట్టణ ప్రాంత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగట్లేదని, ప్రజలకు మౌలిక సదుపాయల్లో లోపం ఉందని గ్రహించిన ప్రభుత్వం ఏకీకృత అభివృద్ధే లక్ష్యంగా అర్బన్, లోకల్ బాడీలను విలీనం చేయాలని నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం 6 జోన్లు, 30 సర్కిళ్లు 150 డివిజన్లుగా ఉన్న బల్దియాలో 27 మున్సిపాల్టీలు ?పెద్ద అంబర్ పేట, జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల, తుక్కుగూడ, మేడ్చల్, నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్ కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, అమీన్ పూర్, బడంగ్ పేట, బండ్లగూడ జాగీర్, మీర్ పేట, బోడుప్పల్, ఫీర్జాదిగూడ, జవహర్ నగర్, నిజాంపేట మున్సిపాల్టీలు జీహెచ్ఎంసీలో విలీనం కావడం వల్ల గ్రేటర్ జనాభా రెండుకోట్లు దాటనుంది. జీహెచ్ఎంసీలో శివారు మున్సిపాల్టీలని విలీనంచేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తుండగా, ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. పరిపాలన పరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయని అభిప్రాయపడుతున్నారు. విలీన ప్రక్రియ పూర్తయితే రాజకీయంగా 6 పార్లమెంట్ స్థానాలు, 28 అసెంబ్లీ స్థానాలతో దేశంలోనే అతి పెద్ద నగరంగా హైదరాబాద్ మహానగరం విస్తరించనుంది.

**హద్దులు, అధికారల విభజనపై అధ్యయనం...**

జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీలు విలీనం చేసేందుకు చర్యలు వేగవంతం అయ్యాయి. ఈప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు హద్దుల నిర్ధారణ, ఎన్ని సర్కిళ్లు ఉండాలి, డివిజన్లు, జోన్లు, వాటి పరిధిలో అధికారాల విభజన వంటి అంశాలపై అధ్యయనం చేసే బాధ్యతను సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్)కు అప్పగించేసింది. 2026 జనవరి 1 నుంచి 2027 జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో ఆలోపే విలీన ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు చెబుతున్నారు. జనాభా లెక్కల సర్వే మొదలయ్యాక నగర హద్దులను మార్చడం అనేది చట్టపరంగా కుదరదని ఆలోపే ప్రకియ పూర్తిచేయాలని భావిస్తున్నట్లు తెలుస్తుంది.

# హైదరాబాద్ వార్త



# సిసి కెమేరాల నిర్వహణకు ప్రత్యేక బృందాలు

**-హైదరాబాద్ సిపి సజ్జనార్**



సీసీ కెమెరాల రిపేర్ కిట్‌లను పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్

**హైదరాబాద్, నవంబరు 27 ప్రభాతవార్త:** నేరాల అరికట్టడంలో సీసీ కెమెరాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఎక్కడైన హత్య, దొంగతనం జరిగినా ఆయా ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలు దొంగలను ఈజీగా పట్టించేస్తుంటాయి. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, నిందితులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయి. దీని ద్వారా చాలా వరకు మహిళలపై దారుణాలు, దొంగతనాలు తగ్గాయనే చెప్పుకోవచ్చు. ఈ నేపథ్యంలో నగరంలో సీసీ కెమెరాల నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. గురువారం బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ ఆడిటోరియంలో అడ్వాన్స్‌డ్ సిటీ సర్వైలెన్స్ గ్రిడ్ మేనేజ్‌మెంట్ ప్రోటోకాల్‌తో పాటు ఐస్ బృందాలను నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులతో కలిసి లోగోను ఆవిష్కరించారు. ఐస్ బృందాలకు రిపేర్ కిట్‌లను అందజేశారు. వారికి కేటాయించిన నూతన వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. నగరంలో ప్రస్తుతం 16 వేలకు పైగా వీధి సీసీటీవీ కెమెరాలు హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో ఉండగా.. 50 వేలకు పైగా కమ్యూనిటీ, ప్రైవేట్ ఫీడ్లు కొనసాగుతున్నాయి. నగరంలో ఉన్న సీసీటీవీ కెమెరాలు ఎప్పటికప్పుడు మానిటర్ చేయడం, మరమ్మతు చేస్తూ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానంగా పనిచేయనున్నాయి. నగరంలోని సీసీటీవీ కెమెరాల నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసేందుకు అడ్వాన్స్‌డ్ సిటీ సర్వైలెన్స్ గ్రిడ్ మేనేజ్‌మెంట్ ప్రోటోకాల్ అనే నూతన వ్యవస్థను సిటీ పోలీస్ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఎంపవరింగ్ యూవర్ ఎవరీడే సేఫ్టీ(ఐస్) బృందాలను ఏర్పాటు చేసింది. సీసీటీవీల వ్యవస్థను విస్తరించడంతో పాటు, అవి నిరంతరం సజావుగా పనిచేసేలా చూడటంతో పాటు నిర్వహణ చర్యలను ఈ బృందాలు చేపడుతాయి.

**ఐస్ ఆవిష్కరణ నగర భద్రతలో మైలురాయి...**

ఐస్ ఆవిష్కరణ నగర భద్రతలో మైలురాయి నిలుస్తుందని నగర సీపీ వీసీ సజ్జనార్ అన్నారు. టెక్నాలజీ డ్యూ డిలిజెన్స్, వేగవంతమైన ఫీల్డ్ స్పందన, బలమైన లాజిస్టిక్స్, అనలిటికల్ ఇంటెలిజెన్స్, సహకార ఫండింగ్ మోడల్.. ఇవన్నీ నగరంలో సీసీటీవీ నిర్వహణ విధానాన్ని పూర్తిగా కొత్త దిశలోకి తీసుకెళ్తాయని ఆయన చెప్పారు. ప్రతి జోన్‌లో రెండు ఐస్ టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి సీసీటీవీ సమస్యను ఇవి పరిష్కరిస్తాయని వివరించారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీటీవీ కెమెరాలను దానం చేయాలని పిలుపునిచ్చారు. సీఎస్ఆర్‌లో భాగంగా క్రిష్టియన్ లీడర్స్ ఫోరమ్ ఇచ్చిన రూ.4 లక్షల చెక్‌ను సీపీ వీసీ సజ్జనర్‌కి సెంట్రల్ జోన్ డీసీపీ శ్రీమతి శిల్పావల్లి అందజేశారు. ఈ కార్యక్రమములో అడిషినల్ సిపి యం.శ్రీనివాసులు, డిసిపి ఎస్.బి కె.అపూర్వారావు, డిసిపి సిసిఎస్, స్వేత,, డిసిపి హెడ్ క్వార్టర్స్, రక్షిత కృష్ణ మూర్తి, డిసిపి నార్త్ జోన్, ఎస్ రష్మి పెరుమాళ్, డిసిపి సెంట్రల్ జోన్ కె.శిల్పావళి, డిసిపి ఐటి సెల్ సి.రూపేశ్, డిసిపి సౌత్ జోన్ కె.కిరణ్ ప్రభాకర్, డిసిపి ఈస్ట్ జోన్ బి.బాలస్వామి, డిసిపి సౌత్ వెస్ట్ జోన్ జి.చంద్రమోహన్, డిసిపి వెస్ట్ జోన్ సిహెచ్.శ్రీనివాస్, డిసిపి సైబర్ క్రైమ్ వి.అరవింద్ బాబు, డిసిపి వుమేన్ సేఫిటీ పి.లావణ్య నాయక్ జాదవ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫిల్మ్‌నగర్‌లో మోడల్ ఫుట్‌పాత్..

**-అభివృద్ధి పనులకు జిహెచ్ఎంసి శ్రీకారం -1.5 కిలోమీటర్ల మేర ప్లాస్టిక్ పేవర్ బాక్స్‌లతో నిర్మాణం**



**హైదరాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి రూ. 1.68 కోట్లతో వినూత్న మోడల్ ఫుట్‌పాత్ ప్రాజెక్టును ప్రారంభించింది. పాదచారుల మార్గాన్ని రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి తయారు చేసిన ప్లాస్టిక్ పేవర్ బ్లాకులతో నిర్మిస్తుంది. ఫిలింగనర్‌లోని రామానాయుడు స్టూడియో నుంచి బీవీబీ జంక్షన్ వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర ఈ నిర్మాణం జరుగుతుంది. ఇందులో 65-70 శాతం వరకు పాత సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలను వాడుతున్నారు. ఈ విధంగా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మాణ రంగంలోకి మళ్లించడం ద్వారా.. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి జీహెచ్ఎంసీ కృషి చేస్తోంది. రామానాయుడు స్టూడియో, రోడ్ నం. 79/82 జంక్షన్, బీవీబీ జంక్షన్, సీవీఆర్ ఈ మార్గం పూర్తయితే.. ఆయా ప్రాంతాల్లోని పాదచారులకు.. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు, వృద్ధులకు సురక్షితమైన నడక మార్గం అందుబాటులోకి వస్తుంది. ఈ మోడల్ ఫుట్‌పాత్ ప్రాజెక్టును నాలుగు నెలల్లోపు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది. రీసైకిల్ ప్లాస్టిక్ పేవర్ బ్లాకులతో నిర్మించే ఈ ఫుట్‌పాత్‌లు సంప్రదాయ సిమెంట్/కాంక్రీట్ బ్లాకులతో పోలిస్తే.. ఎక్కువ మన్నికను కలిగి ఉంటాయని.. అలాగే నిర్వహణ ఖర్చు కూడా తగ్గుతుందని ఇంజనీర్లు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే.. హైదరాబాద్ నగరంలోని ఇతర ప్రాంతాలలో కూడా ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి తయారైన ప్లాస్టిక్ పేవర్ బ్లాకులతో ఫుట్‌పాత్‌లను నిర్మించే అవకాశం ఉందని తెలుపుతున్నారు. జీహెచ్ఎంసీ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రెండు ముఖ్య ప్రయోజనాలున్నాయి. పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారిన లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ యార్డులకు చేరకుండా.. వాటిని స్థిరమైన నిర్మాణ వస్తువులుగా మార్చి కాలుష్యాన్ని సమర్థవంతంగా తగ్గించవచ్చు.

అంతే కాకుండా.. సాంప్రదాయ నిర్మాణ వస్తువులపై ఆధా రపడటాన్ని తగ్గించి.. స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యర్థాలను సంపదగా మార్చుకోవచ్చు.

# అసలేం జరుగుతోంది..?

**-పదోన్నతుల్లో అవకతవకలపై సిఎండి సీరియస్ -హెచ్ఆర్ విభాగం తీరుపై అభ్యంతరం**

**హైదరాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్)లోని ఇంజనీర్ల పదోన్నతుల్లో చోటు చేసుకున్న అవకతవకలపై సీఎండీ ముషారఫ్ ఫారూఖీ సీరియస్ అయినట్లు తెలుస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా ఓ ఏడీఈకి కీలక ఫోకల్ పోస్టు కట్టబె ట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. అవినీతి, అక్రమ వసూళ్ల ఆరోపణలు ఎదుర్కొంటూ..ఏడాది క్రితం నాన్ ఫోకల్ పోస్టులోకి వచ్చిన ఏడీఈకి మళ్లీ ఏ విధంగా ఫోకల్ పోస్టు కట్టబెట్టారని హెచ్ఆర్ విభాగాన్ని నిలదీసి సదరు ఏడీఈ ఉత్తర్వులను నిలిపివేయాల్సిందిగా ఆదేశించినట్లు సమాచారం. అయితే ఆఏడీఈ మాత్రం ఇప్పటికే విధుల్లో చేరినట్లు తెలుస్తుంది. ఇబ్రహీంబాగ్ ఏడీఈ పోస్టు కోసం రూ.70 లక్షలు, సంగారెడ్డి డీఈ పోస్టుకు రూ.50 లక్షలు, చేవెళ్ల ఏడీఈ పోస్టుకు రూ.30 లక్షల చొప్పున చేతులు మారినట్లు ఉద్యోగ వర్గా ల్లో తీవ్రమైన చర్చ కొనసాగుతోంది. ఇబ్రహీంబాగ్ ఏడీఈగా నియమించిన వ్యక్తి గతంలో గచ్చిబౌలి ఏడీఈగా పని చేస్తున్న సమయంలో ట్రాక్ రికార్డును సీఎండీ గమనించారని, చిత్రపురి కాలనీలో జరిగిన వ్యవహారంలో ఏడీఈ నిర్వాహకం వల్ల సంస్థకు లక్షల్లో నష్టం జరిగిందని, అలాగే అమె రికన్ కంపెనీ భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటులో జరిగిన అవకతవకలను సైతం గుర్తించినట్లు తెలిసింది. అయితే ఇక్కడ మంత్రి పేరుతో జరుగుతున్న వసూళ్లపై డిస్కంలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమైనని తాను పట్టించుకుంటున్నప్ప టికీ కిందిస్థాయి పోస్టుల బదిలీల బాధ్యతలను హెచ్ఎర్ డైరెక్టర్ నమ్మకంతో అప్పగించారనే ప్రచారం ఉంది. అయితే సదరు డైరెక్టర్ తన నమ్మకాన్ని వమ్ము చేశారని ఉన్నతాధికారుల వద్ద సీఎండీ సీరియస్ అయినట్లు తెలుస్తుంది.

# మణికొండలో భూగర్భ విద్యుత్ కేబుళ్లు వేసేందుకు అధికారుల కసరత్తు

**- మణికొండ వాసులు ఆనందం వ్యక్తం**



మణికొండలో జరిగిన ప్రజాబాట కార్యక్రమంలో పాల్గొన్న విద్యుత్ శాఖ అధికారులు, వివిధ కాలనీల ప్రతినిధుల దృశ్యం.

**నార్సింగి, నవంబర్ 27 ప్రభాతవార్త :** ఇటీవల రాష్ట్ర కేబినెట్ సమావేశంలో భూగర్భ విద్యుత్ కేబుళ్ల వేసేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. ఈ ప్రకటనను నిజం చేసేందుకు రంగారెడ్డి విద్యుత్ శాఖ అధికారులు శ్రీకారం చుడుతున్నారు. గురువారం ప్రజాబాటలో భాగంగా మణికొండలోని పలు కాలనీల్లో విద్యుత్ శాఖకు చెందిన డైరెక్టర్ కమర్షియల్ చక్రపాణి, జిల్లా చీఫ్ జీఎం పాండ్యా నాయక్, సైబరాబాద్ ఎస్ఇ చంద్రశేఖర్, డిఇ రమేష్‌చంద్ర, ఏడీఇ సతీష్‌రెడ్డి, ఏఈ సంతోష్ కుమార్‌లు పర్యటించారు. ఆల్ కాలనీస్ ఫెడ్రేషన్ అధ్యక్షులు అర్వపల్లి వంశీ విద్యుత్ శాఖ అధికారులను కలిసి భూగర్భ విద్యుత్ కేబుళ్ల పతకంను అల్కాపూర్ టౌన్‌షిప్ నుంచి ప్రారంభించాలని కోరారు. ఇందుకు అధికారులు సమ్మతం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల అనుమతిని తీసుకొని తొలిసారిగా మణికొండలోనే భూగర్భ విద్యుత్ కేబుళ్లను వేసేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. అలాగే కాలనీల్లోని వివిధ ప్రాంతాలలో వేలాడుతున్న తీగలు బిగించడం, తెగిపోయిన వైర్లను రిస్ట్ చేయడం, విద్యుత్ నెట్‌వర్క్‌కు తాగిన చెట్ల కొమ్మలను క్లియర్ చేయడం, ట్రాన్స్‌ఫార్మర్ యార్డులను శుభ్రం చేయడం, దెబ్బతిన్న ఫ్యూజ్ బాక్సులను మార్చడం వంటి కీలక సహాయ పనులను నిర్వహించారు. సురక్షితమైన, విశ్వసనీయమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు శక్తిమేరకు పని చేస్తునాననమని అధికారులు స్పష్టం చేశారు. హై ఓల్టేజీ హెచ్చు తగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్ లోడ్, పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్ల అప్‌గ్రేడేషన్ ఆవశ్యకతకు సంబంధించిన సమస్యలపై చర్చించారు. సత్వర సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు హామీనిచ్చారు. అధికారుల స్పందన పట్ల వంశీతో పాటు డాక్టర్ అవినాష్, శ్రీనివాస్, ఎస్వీ ఎస్ఎస్ శర్మ, శంకర్‌దేవ్, మహేంనరదాచారి, శ్రీధర్, నాగార్జున, రాజు, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కిషోర్‌లు ఆనందం వ్యక్తం చేశారు.

## అభ్యుదయ సాహిత్య సృష్టికర్త మనాశ్రీ

**- సినీనటుడు, కవి తనికెళ్ళ భరణి**



మనాశ్రీ పాటల పల్లకి సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న తనికెళ్ళభరణి, లక్ష్మీనారాయణ, మనాశ్రీ, రమేష్, రాజకుమార్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, నవంబరు 27 ప్రభాతవార్త :** అభ్యుదయ సాహిత్య సృష్టికర్త రచయిత మనాశ్రీ అని, మనాశ్రీ కవితలు, పాటల్లోని నిర్దిష్టమైన భావాలు ఎంతో ఆదర్శవంతమైనవని సిబిఐ పూర్వ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో అక్షజ్ఞ పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన సుప్రసిద్ధ సినీకవి, దేవాలయాలకు, మెరుగైన సమాజం కోసం అనేక గీతాలు వ్రాసిన కవనధురీణ బిరుదాంకితుడు మనాశ్రీ రచించిన మనాశ్రీ పాటల పల్లకి పాటల సంకలనాన్ని తనికెళ్ళభరణి, జెడి లక్ష్మీనారాయణలు మిగతా అతిథులు సినీనిర్మాత వల్లూరిపల్లి రమేష్, రాఘవరావు, డా. కపర్ది, డా. విక్రాంత్‌రెడ్డి, కామేశ్వరరావు, బలభద్ర వెంకటరాజు, ప్రఖ్యాతశిల్పి రాజకుమార్, అక్షజ్ఞ వెంకట్ తదితరులతో కలిసి ఆవిష్కరించి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మనాశ్రీ శ్రేయోభిలాషులు, మిత్రులను తగిన బిరుదులతో ఘనంగా సన్మానించి గౌరవించారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 28,29 తేదీల్లో డిగ్రీ కోర్సులకి తుది కౌన్సెలింగ్

**అత్తాపూర్ నవంబర్ 27, ప్రభాతవార్త :** 2025-26 విద్యా సంవత్సరానికి ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని వివిధ రెగ్యులర్ డిగ్రీ, స్పెషల్ కోటా యూజీ కోర్సులలో ప్రవేశాలకు చివరి దశ కౌన్సిలింగ్ ఈనెల 28 వ తేదీ (శుక్రవారం) ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒక ప్రకటన లో తెలిపింది. రైతు కోటాలో సుమారు 22 సీట్లు, రైతు కూలీల కోటా లో సుమారు 40 సీట్లు ఖాళీ గా ఉన్నాయని వాటిని ఈ కౌన్సిలింగ్ ద్వారానే భర్తీ చేయనున్నట్లు విశ్వ విద్యాలయం పేర్కొంది. తల్లితండ్రులు, విద్యార్థులు కేటగిరీల వారీ గా సీట్ల వివరాలుని వెబ్సైటు లో చూసి కౌన్సిలింగ్ కి హాజరు కావాల్సింది గా విశ్వ విద్యాలయం సూచించింది. అదేవిధంగా నవంబర్ 29 వ తేదీ (శనివారం) మధ్యాహ్నం రెండు గంటలకు ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ ప్రాయోజిత కోటా బిఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, బిటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బిటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), బిఎస్సీ (ఆనర్స్), కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి వాక్‌ఇన్‌కౌన్సిలింగ్ జరగనుందని విశ్వవిద్యాలయం ఒక ప్రకటన లో తెలిపింది. ఈ రెండు కౌన్సిలింగ్‌లు రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నే జరగనున్నాయి. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, వెబ్ సైట్ లో పేర్కొన్న రుసుముతో కౌన్సిలింగ్ కు హాజరుకావాలనీ, పూర్తి వివరాలు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ లో చూడవచ్చని విశ్వ విద్యాలయం ఆ ప్రకటన లో తెలిపింది.

## అమీర్‌పేటలో పేలిన వాషింగ్ మిషన్

**..భయాందోళనకు గురైన స్థానికులు**



ప్రముఖ కంపెనీ అయినా ఎల్‌జీ వాషింగ్ మిషన్‌లో పేలుడు దృశ్యం

**సంజీవరెడ్డినగర్, 27 ప్రభాతవార్త:** అమీర్‌పేట దరమ్ కరమ్ రోడ్డులో నివాసం ఉండే ఓ ఇంటిలో ప్రముఖ కంపెనీకి చెందిన వాషింగ్ మిషన్‌లో పేలుడు సంబంధింది బట్ట లు ఉతుకుతున్న సమయంలో ఒక్కసారిగా భయంకరమైన శబ్ధం వెలువడడంతో ఉక్కిరి బిక్కిరి అయి భయాందోళనకు గురైన స్థానికులు, మిషన్ పూర్తిగా పాడైపోయింది. అందులోని భాగాలు ఇంటి పై బాల్కానీ లోని పై కప్పును తాకి కిందపడిందని, అదృష్ట వశాత్తూ దగ్గర ఎవరు లేకపోవడం ఎలాంటి ప్రాణ నష్టం జరగ లేదు. మిషన్ సాంకేతిక లోపాల కారణం గానే ఈ పేలుడు సంబవించి ఉండవచ్చునని స్థానికులు అన్నారు. దీనికి సంబందించిన వివరాల ఇంకా తెలియాల్సి ఉంది.

## విద్యార్థులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని లక్షలు వసూలు చేసిన ఐటీ కంపెనీ

**400 మంది వద్ద రూ.3 లక్షల చొప్పున వసూలు**

**కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**మాదాపూర్, నవంబర్ 27, ప్రభాతవార్త :** ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేసిన సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిదిలో గురువారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం మాదాపూర్‌లోని ఎన్ఎఎస్ఎన్ ఇన్ఫోటెక్ కంపెనీ విద్యార్థుల వద్ద శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి కొక్కక్కరి వద్ద నుంచి రూ. 3లక్షల వరకు వసూలు చేసినట్టు తెలిపారు. దాదాపు 400 మంది వద్ద డబ్బులు వసూలు చేశారన్నారు. విద్యార్థులను మోసం చేసి వసూలు చేసిన డబ్బుతో కంపెనీ డైరెక్టర్ స్వామినాయుడు పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఫిర్యాదు చేసిన వివరాల ప్రకారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అగ్ని ప్రమాదాల నివారణకు విస్తృతంగా మాక్ డ్రిల్

**-జిల్లా ఫైర్ ఆఫీసర్ మురళీ మనోహర్ రెడ్డి**



**అత్తాపూర్ నవంబర్ 27, ప్రభాతవార్త :** బహుళ అంతస్తుల భవనాలలో అగ్ని ప్రమాదాల నివారణ పై ప్రజలలో అవగాహన కల్పించడానికి విస్తృతంగా మాకు డ్రిల్ లను నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఫైర్ ఆఫీసర్ మురళి మనోహర్ రెడ్డి వెల్లడించారు. గురువారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని లక్ష్మీరాం హరన్ అపార్ట్మెంట్లో అగ్నిమాపక శాఖ పెద్ద ఎత్తున మార్క్‌అగ్నిమాపక శాఖ పెద్ద ఎత్తున మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ డ్రిల్‌లో వంటింట్లో అగ్ని ప్రమాదం నుంచి మొదలుకొని అపార్ట్మెంట్లో అన్ని కోణాలలో జరిగే ప్రమాదాలపై ఫైర్ ఫైటర్లు ప్రాక్టికల్‌గా అవగాహన కల్పించారు. మహిళలు స్థానికులు ఈమార్క్ డ్రిల్ లో ప్రతి సంఖ్యలో పాల్గొని ప్రమాదాల నివారణ జాగ్రత్తలను ప్రాక్టికల్ గా తెలుసుకున్నారు. చిన్నచిన్న అగ్ని ప్రమాదాలను వెంటనే నివారించడానికి ప్రజలలో ముఖ్యంగా మహిళల్లో అవగాహన అత్యవసరమని గుర్తించి మాక్ డ్రిల్లను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా లీడింగ్ ఫైట్ ఫైటర్లు . రాము, ఇతర సిబ్బంది దామోదర్ రెడ్డి, రమేష్, వెంకట్, గోపాల్ తదితరులు ప్రాక్టికల్ గా వివరించిన తీరు చాలా బాగుందని లక్ష్మీరాం హరన్ అపార్ట్మెంట్ వాసులు స్థానికులు ప్రశంసించారు. వారిని సన్మానించారు.

## లింగంగౌడ్ కుటుంబానికి బిఆర్ఎస్ అండ : ఎమ్మెల్యే కాలేరు


బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగం గౌడ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**ముషీరాబాద్, నవంబర్ 27, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ సీనియర్ నేత లింగం గౌడ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండ గా ఉంటుందని అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హామీ ఇచ్చారు. గురువారం లింగంగౌడ్ దశదిన కార్యక్రమం ఎస్ఆర్‌జీ ఫంక్షన్‌హాల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ హాజరై లింగంగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. స్థానిక సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి లింగంగౌడ్ చేసిన సేవలను వారు స్మరించుకున్నారు. లింగంగౌడ్ అకాల మరణం పార్టీకి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై లింగంగౌడ్ ఆత్మ శాంతికై మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు.

## సిఎంఆర్ఎఫ్ పథకం పేదలకు వరం : అరికెపూడి గాంధీ


లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న గాంధీ

**కూకట్‌పల్లి, నవంబర్ 27, ప్రభాతవార్త :**
ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలోని పలువురు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన మంజూరి పత్రాలను బాధిత కుటుంబాలకు పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ తనకాంప్ కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం నిరుపేదలకు సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వైద్య చికిత్సకి సహకారం అందించిన ఆరెకపూడి గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, జిల్లా గణేష్, నరేష్, చిరుమర్తి రాజు, మంజుల, పద్మ, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

## మణికొండలో సమీకృత వ్యవసాయ మార్కెట్‌ను నిర్మించాలి

**- బిఆర్ఎస్ అధికార ప్రతినిధి ఉపేంద్రనాథ్‌రెడ్డి**

**నార్సింగి, నవంబర్ 27 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 65.లో గత పాలకవర్గం తీర్మాణం చేసిన విధంగా వెంటనే సమీకృత వ్యవసాయ మార్కెట్‌ను నిర్మించాలని బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మణికొండలో ఆయన మాట్లాడుతూ మూడేళ్ల క్రితమే సర్వే నెంబర్ 65.లో ఉన్న ఎకరంకు పైగా భూమిలో సమీకృత వ్యవసాయ మార్కెట్‌ను నిర్మించాలని తీర్మాణం చేసిందన్నారు. సకాలంలో పాలకవర్గం ఆ పని చేయకపోవడం వలన ఇప్పుడు ఆ స్థలంను కబ్జా చేసేందుకు కొందరు కుట్ర చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఈ నిర్మాణం చేయకపోవడం వలన రోడ్లపైనే వీధి వ్యాపారులు, సంతలు నిర్వహించడం జరుగుతుందని, ఫలితంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకునేందుకు ప్రజలు, ప్రజా ప్రతినిదులు, అధికారులు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సర్వే నెంబర్ 65.లో బుల్కాపూర్ నాలా ఆధునీకరణకు నియమించబడ్డ ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ లేబర్ క్యాంపు పేరుతో భూమిని చదును చేసి, ఏకంగా బోర్ వేశారని తెలిపారు. ఓ కాంట్రాక్టర్ చేసిన పనిని సైతం గత పాలకవర్గం చేయకపోవడంను నిశితంగా గమనిస్తే కావాలని ఈ అంశంను పక్కన పెట్టినట్లు అవగతం అవుతుందన్నారు. ఖరీదైన ఈ భూమిని దారాదత్తతం చేయాలన్న కుట్రకోణం దాగుందని మణికొండ వాసులు చర్చించుకుంటున్నారన్నారు. వెంటనే హైడ్రా అధికారులు గాని, రెవెన్యూ అధికారులు గాని స్పందించి చారిత్రక బుల్కాపూర్ నాలను కాపాడాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందని ఉపేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఘనంగా సంవిధాన్ దినోత్సవం


సంవిధాన్ దినోత్సవం నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 27, ప్రభాతవార్త :** బాగ్ లింగంపల్లి డాక్టర్ డా. బి.ఆర్. అంబేద్కర్ లా కళాశాల ఆధ్వర్యంలో సంవిధాన్ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు వంశీ కృష్ణ హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ కృష్ణదేవ రావు మాట్లాడుతూ మార్పుకు దోహదం చేసే రాజ్యాంగం సమకాలీన చర్చల ద్వారానే పరిష్కరించుకోవచ్చని అన్నారు. రాజ్యాంగం ఎందుకు అవసరమో వివరించి, దాన్ని "పవర్ మ్యాప్" తో అభివర్ణించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, అంబెడ్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి, సంయుక్త కార్యదర్శి రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పి ఐ ఎల్ ఓరల్ ప్రెజెంటేషన్ అవార్డులతో పాటు పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు.

**స్వార్థంతో నీచపనులకు ఒడిగట్టడం-ఇది ప్రమాదానికి సంకేతం నాటకం**

**రవీంద్రభారతి, నవంబరు 27 ప్రభాతవార్త :** మనుషులు సమాజం పట్ల బాధ్యతలను కోల్పోయి తమ స్వార్థం కోసం ఎలాంటి నీచమైన పనులకైనా ఒడిగట్టడం, అది తీరని దుఃఖానికి దారితీస్తుందనే సందేశాత్మక ఇతివృత్తంతో కూచినదే ఇది ప్రమాదానికి సంకేతం నాటకం అని ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి తెలిపారు. రసరంజని హైదరాబాద్ ప్రతీనెలా రవీంద్రభారతి ప్రధాన మందిరంలో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనల్లో భాగంగా గురువారం దృశ్యవేదిక, విజయవాడ వారి సమర్పణలో ఆకునాతి భాస్కర్ చన్ద్ర రచన, ఎస్.కె.మిత్రో దర్శకత్వంలో, హెచ్‌విఆర్ఎస్.ప్రసాద్ నిర్వహణలో ప్రధాన పాత్రల్లో కె.శ్యామ్‌ప్రసాద్, హెచ్‌విఆర్ఎస్.ప్రసాద్, డి.ప్రకాష్, నరేన్, ప్రకాశరావు, భాగ్యరాజ్, భాస్కరశర్మ, సత్యానందిని తమతమ పాత్రలకు ప్రాణంపోసి అద్భుతంగా ప్రదర్శింపబడిన ఇది ప్రమాదానికి సంకేతం సందేశాత్మక నాటకం అధికసంఖ్యలో నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు ఎంతగానో ఆకట్టుకుని ఆలోచింపజేసి ప్రశంసలు అందుకుంది.

## కాలానుగుణంగా కరికులం మార్పులు అవసరం : ప్రొఫెసర్ అనీల్ సహస్రబుద్ధే



సమావేశంలో మాట్లాడుతున్న అనీల్ సహస్రబుద్దే.

**జూబ్లీహిల్స్, నవంబర్ 27, ప్రభాతవార్త:**
విద్యా 'కరికులం'ను కాలానుగుణంగా మార్చడం అత్యవసరమని నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరం–నాక్ చైర్మన్ ప్రొఫెసర్ అనీల్ సహస్రబుద్ధే అన్నారు. ఫిక్కీ నిర్వహించిన ఫ్యూచర్ ఫార్వర్డ్: ఏఐ ఆధారిత ప్రపంచానికి విద్యను పునర్నిర్మించడం సదస్సులో పాల్గొన్న ఆయన, పాత కరికులం ఉద్యోగావకాశాలు లేని గ్రాడ్యుయేట్లను తయారు చేస్తోందని, ఏఐ సూచనలు ఇవ్వగలిగినా తుది నిర్ణయం మనుషులదేనని స్పష్టం చేశారు. గత రెండు దశాబ్దాల్లో టెక్నాలజీ జీవన విధానాన్ని మార్చిందని, అన్‌లెర్నింగ్, రీ-లెర్నింగ్, స్కిల్లింగ్ విద్యార్థుల కోసం కీలకమైందన్నారు. డిజిటల్ యాక్సెస్‌ను గ్రామీణ, దూర ప్రాంతాలకు విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అధ్యాపకులు నిరంతరం నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని ఆయన హైలైట్ చేశారు. టెక్నాలజీ మారుతున్న కొద్దీ ఉపాధ్యాయుల పాత్ర కూడా పెరుగుతుందని చెప్పారు. పరిశ్రమలు కేవలం 20–30 శాతం గ్రాడ్యుయేట్లను మాత్రమే తీసుకోగలవన్న నేపథ్యంలో ఎంట్రప్రెన్యూర్‌షిప్ కీలకమని వివరించారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్ట రెడ్డి మాట్లాడుతూ, ఇన్నోవేషన్లు, ఆవిష్కరణలు కరికులం సంబంధితతపై ప్రభావంచూపుతున్నాయని, తెలంగాణ ఇప్పటికే సిలబస్‌లో 20 శాతం భాగాన్ని టెక్నాలజీతో అనుసంధానం చేసిందన్నారు. పాత కోర్సులను తొలగించడం అవసరమని తెలిపారు. సదస్సులో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొ. బీఎస్ మూర్తి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. ఉన్నత విద్యావంతులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు ఏఐ ప్రభావం, స్కిల్లింగ్–ఉపాధి అవకాశాలు, గ్రీన్ ఎకానమీ, సెమీకండక్టర్ల రంగాల్లో అవకాశాలపై చర్చించారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో ప్యానల్ చర్చలు, డిజైన్ థింకింగ్, బాధ్యతాయుత ఏఐ, విద్యార్థి–కేంద్రీకృత నాయకత్వం వంటి అంశాలపై వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నారు.

## డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్‌కు అభినందనల వెల్లువ


వజ్రేష్ యాదవ్‌కు అభినందనలు తెలుపుతున్న డాక్టర్ సత్యం శ్రీరంగం

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 27, ప్రభాతవార్త :**
మేడ్చల్ మల్కాజ్‌గిరి డీసీసీ నూతన అధ్యక్షులుగా నియమితులైన తోటకూర వజ్రష్ యాదవ్‌ని పిసిసి సభ్యులు అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు. జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రష్ యాదవ్‌తో కలిసి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని ఈ సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తెలియజేశారు. వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమవుతుందని పార్టీ కార్యకలాపాలు ప్రజలకు మరింత చేరువవుతాయని విశ్వసిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలని అధిరోహించాలనిమనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా పార్టీ ప్రతిష్ఠమైన ప్రజా వ్యూహాలతో ముందకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, కెపిహెచ్బి డివిజన్ తమ్మినేని ప్రవీణ్ కుమార్, బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షులు మహేష్ యాదవ్, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, బోయిన్‌పల్లి డివిజన్ మహిళా అధ్యక్షురాలు విజయ లక్ష్మీ, ఫతేనగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, కూకట్‌పల్లి డివిజన్ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, నల్ల పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, ఐఎన్ టియూసి నాయకులు నరసింహ యాదవ్, ఏఎంసీ డైరెక్టర్ అరుణ్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకన్న, తూము కొండల్, జిబిన్, పవన్, అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ సంగీతాన్ని విశ్వవ్యాప్తం చేసిన సుబ్బలక్ష్మి : అయాచితం శ్రీధర్


ప్రసంగిస్తున్న తెలంగాణ గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ అయాచితం శ్రీధర్

**చిక్కడపల్లి నవంబర్ 27, ప్రభాతవార్త :**
భారతీయ సంగీతం ప్రత్యేకించి దక్షిణ భారత శాస్త్రీయ కర్ణాటక సంగీతాన్ని ఉన్నత స్థాయిలో నిలిపిన ప్రముఖులలో ఏం ఎస్ సుబ్బ లక్ష్మి అగ్రగణ్యులు అని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ అయాచితం శ్రీధర్ అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళావేదికలో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి.ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. కర్ణాటక సంగీత విదుషీమణి ఏం ఎస్ సుబ్బ లక్ష్మి యాది లో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అయాచితం శ్రీధర్ మాట్లాడుతూ తమిళ నాడు లోని మధ్య తరగతి కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా సంగీత సాధన చేస్తూ ఎదిగిన సుబ్బ లక్ష్మీ గాంధీజీ కోరిక మేర హరి తుమ్ హరే పాటను గానం చేసి ఆయ నను ముగ్ధులను చేశారు సుబ్బలక్ష్మి నటించిన మీరా బాయి సినిమా నాటి ప్రధాని నెహ్రూ, మౌంట్ బాటెన్ సరోజినీ నాయుడు వంటి ప్రముఖులతో చూసి నేను దేశానికి మాత్రమే ప్రధానిని సుబ్బలక్ష్మీ సంగీత సామ్రాజ్యానికి చక్రవర్తి అని కొనియాడారనీ గుర్తుచేశారు. దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న సంగీత రంగంలో తొలి గా అందుకున్న సుబ్బలక్ష్మి తను సంపాదించిన ధనం అంతా దాన ధర్మాలకు ఖర్చు చేయటం తో చివరి రోజులో పేదరికం తో జీవితం గడిపారు అని చెప్పారు అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ సుబ్బలక్ష్మి భక్తి పాటలు మధురం గా ఆలపించారు అని వివ రించారు వేదిక పై విశ్వసాహితి సంస్థ అధినేత బి. జయరాములు, సంఘసేవకులు పిఎస్ఎన్ మూర్తి, ప్రముఖ గాయకుడు వడ్లకొండ వెంకట రావు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌లో దీక్ష దివస్ పోస్టర్ ఆవిష్కరణ


కేసీఆర్ దీక్షకు స్మరణగా పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి నవంబర్ 27 ప్రభాతవార్త :** తెలంగాణ భవన్ లో నవంబర్ 26, తెలంగాణ స్వపరిపాలన కోసం ప్రాణాలర్పణకు సిద్ధమై, ప్రాంత హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన కే.చంద్రశేఖర్ రావు గారి చారిత్రాత్మక నిరాహార దీక్షకు ప్రతీకగా నిలిచిన రోజు "నవంబర్ 29, దీక్ష దినోత్సవం". "తెలంగాణ అచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.." అంటూ ఉద్యమం దిశను మార్చిన ఆ గర్జన, ఆత్మగౌరవ ఉద్యమానికి కొత్త బాటలు వేసింది. రాష్ట్ర ఆవిర్భావ పోరాటంలో కీలక మలుపుగా నిలిచిన ఆ రోజు, కోట్లాది ప్రజలకు నూతన ఆశలను నూరిపోసింది.దీక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తెలంగాణ భవన్‌లో టిఆర్ఎస్ యువ నాయకులు ముఠా జై సింహ రూపొందించిన దీక్ష దినోత్సవ పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే ఈ పోస్టర్ కేసిఆర్ ధైర్యం, త్యాగం, సంకల్పాన్ని మరువలేని సంఘటనగా మరోసారి ప్రజలకు గుర్తుచేసింది. ఉద్యమ సమయంలో ప్రజల్లో నింపిన జోష్, నమ్మకం, నాయకత్వానికి ఈ పోస్టర్ ప్రతిరూపంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ సురభి వాణి దేవీ, మాజీ చైర్మన్ ఎరోల్లా శ్రీనివాస్, సీనియర్ టిఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దీక్ష స్ఫూర్తిని మరోసారి స్మరించుకుని, తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి కేసీఆర్ చేసిన అపార త్యాగాలను ఈ సందర్భంగా నేతలు కీర్తించారు.

## విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ఆపాల్సిందే..

**-లేకుంటే దేశమంతా ఉద్యమం బలోపేతం**

**-తెలంగాణ పవర్ ఇంజనీర్స్ జెఏసీ**


మింట్‌కాంపౌండ్‌లో నిరసన తెలుపుతున్న జేఏసీ నేతలు సాయిబాబా, రత్నాకర్‌రావు,బీసి రెడ్డి, సదానందం తదితరులు

**హైదరాబాద్,నవంబర్ 27,ప్రభాతవార్త:**
కేంద్రప్రభుత్వం విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ అఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ పిలుపుమేరకు ఉత్తర ప్రదేశ్ విద్యుత్ కంపెనీ సంస్థలను ప్రైవేటుపరం చేయవద్దని దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమం చేపట్టారు .ఈనేపథ్యంలో మింట్‌కాపౌండ్‌లోని టిజిఎస్పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా జేఏసీ నేతలు సాయిబాబా, రత్నాకర్ రావు, బీసీ రెడ్డిలు మాట్లాడుతూ మాట్లాడుతూ ఉత్తర ప్రదేశ్ విద్యుత్ ఉద్యోగులు గత సంవత్సరం కాలం నుండి నిరసనలు తెలియజేస్తూ ప్రైవేటీకరణ ఆపుతూ వస్తున్నారని వారికి తాము సంఘీభావం తెలుపుతున్నామన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2025ను పార్లమెంట్లో ఆమోదిస్తే దేశ వ్యాప్త సమ్మెకు వెనుకాడం అన్నారు. దేశంలో కలకత్తా, బొంబాయి అధిక రేట్లకు విద్యుత్ ఇస్తున్నారని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉంటే వినియోగదారులకు రైతులకు తక్కువ రేటుకు విద్యుత్ దొరుకుతుందన్నారు. జనవరి 30న జరిగే చలో ఢిల్లీలో పాల్గొనాలని దేశవ్యాప్త ఉద్యోగులు అందరికీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి గోవర్ధన్ నెహ్రూ సదానందం, 300 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

## భారత ప్రజాస్వామ్యానికి రాజ్యం పునాది

**-బిజెపి సీనియర్ నేత కంచి మహేందర్**



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేస్తున్న మహేందర్

**మూసాపేట్, నవంబర్ 27, ప్రభాతవార్త**
డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించి మహానుభావునికి గురువారం భారతీయ జనతా పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకి అమలు కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వారి ఎన్నికల వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు ఒకరోజు దీక్ష చేపట్టారు. దీక్ష ప్రాంగణానికి పోలీసులు విచ్చేసి, శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ సీనియర్ నాయకులు కంచి మహేందర్ స్వయంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకొని, నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు శంకర్ రెడ్డి, డా. కిరణ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సురేందర్ రెడ్డి, నాయకులు జి. రమేష్, శివరంజని తదితరులు పాల్గొన్నారు.

## జనరల్ స్థానాల్లో బిసిలను పోటీకి దింపి, అగ్రవర్ణాలను ఓడిస్తాం

**-తెలంగాణ బిసి పొలిటికల్ ఫ్రంట్ హెచ్చరిక**


అభివాదం చేస్తున్న ఫ్రంట్ నేతలు బాల్‌రాజ్‌గౌడ్, వెంకన్నగౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు

సైఫాబాద్, నవంబరు 27 ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల కేటాయించడంలో అన్యాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పెందుకు జనరల్ స్థానాల్లో బిసిలు పోటిచేసి అగ్రకులాలను ఓడించాలని తెలంగాణ బిసి పొలిటికల్ ఫ్రంట్ నాయకులు పిలుపునిచ్చారు. కామారెడ్డిలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని కర్ణాటక సిఎం సిద్దరామయ్యతో చెప్పించి, ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బిసిలను దగా, మోసం చేసిందని ఫ్రంట్ నాయకులు ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ చైర్మన్, 42 శాతం రిజర్వేషన్‌ల సాధన సమితి అధ్యక్షుడు బాలగోని బాలరాజ్‌గౌడ్, కన్వీనర్లు అయిలి వెంకన్న గౌడ్, ఎలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్‌లపై రాష్ట్ర హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, ఇంతలోనే ప్రభుత్వం గ్రామపంచాయితీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి బిసిలకు తీరని అన్యాయం చేశారని, జనరల్ స్థానాల్లో బిసిలను పోటికి పెట్టి తగిన బుద్ధి చెపుతామన్నారు. 60 శాతం ఉన్న బిసిలకు గ్రామ పంచాయితీ ఎన్నికల్లో 17 శాతం రిజర్వేషన్‌లు కేటాయించడం నమ్మకద్రోహమన్నారు. ఇప్పటికైనా బిసిలకు ప్రభుత్వం చేసిన మోసాలను గ్రహించాలని, అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న బిసి ప్రజా ప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేసి బిసిల పక్షాన పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఫ్రంట్ నాయకులు అంబాల నారాయణగౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, రాజ్, నాగభూషణం, మీనగా గోపి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి బలోపేతానికి కలిసికట్టుగా పనిచేయాలి : రాజ్ భూపాల్ గౌడ్

**- ఉప్పర్‌పల్లిలో నూతన బిజెపి కార్యాలయం ప్రారంభం**



**అత్తాపూర్ నవంబర్ 27,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్‌లో బిజెపి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కష్టపడాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్ పేర్కొన్నారు.గురువారం రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్ పల్లి లో నూతన ఏర్పాటు చేసిన బిజెపి కార్యాలయం ప్రారంభోత్సవాన్ని డివిజన్ అధ్యక్షులు పసుపుల సందీప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ హాజరై రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్,బిజెపి ముఖ్యనేతలతో కలిసి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ...దేశంలో బిజెపికి రోజురోజు ఆదరణ పెరుగుతుందని రాబోయే రోజుల్లో కూడా తెలంగాణ బిజెపి జెండా ఎగరడం ఖాయమని వచ్చే ఎన్నికల్లో బిజెపిని గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమానికి బిజెపి కార్యకర్తలు భారీ సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేయడం ఆనందంగా ఉందన్నారు.కార్యక్రమంలో వై శ్రీధర్ ఎన్ మల్లారెడ్డి ,తోకల శ్రీనివాస్ రెడ్డి ,కొమురయ్య ,అంజన్ కుమార్,మల్లేష్ యాదవ్, బొక్క బాల్ రెడ్డి,సోల్కర్ రెడ్డి ,వనిత రెడ్డి కృష్ణవేణి,బాబు రావు,హరికిషన్ , షాబాద్ విజయ్,రాజశేఖర్ రెడ్డి, వెంకటేష్,న్.జగన్,మల్లేష్ చారి,సురేందర్,పద్మావతి,విజయ్ యాదవ్,అంబిక,రాకేష్ గౌడ్,యాదయ్య, వేణుగోపాల్, తిరుమలేష్,శివ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ముషీరాబాద్ నియోజకవర్గంలో ఇందిరమ్మ క్యాంటీన్లు ప్రారంభం

**చిక్కడపల్లి నవంబర్ 27 ప్రభాతవార్త :** ముషీరాబాద్ ఆసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రెండు ప్రాంతాలలో ఇందిరమ్మ క్యాంటిన్లను శుక్రవారం ప్రారంభించబోతున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేటర్ సర్కిల్ 15 డిప్యూటీ కమీషనర్ రామాంజుల రెడ్డి వివరించారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ వద్ద, అదే విధంగా కవాడిగూడ డివిజన్ లోని కల్పనా చౌరస్తా వద్ద ఈ క్యాంటీన్ లను కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమం, జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రారంభిస్తారని, కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్, శాసన మండలి సభ్యుడు సురభి వాణీదేవి, ముషీరాబాద్ శాసనసభ్యుడు ముఠా గోపాల్, నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి,రాంనగర్,భోలక్ పూర్,కవాడిగూడ కార్పొరేటర్లు రవిచారి,గౌస్ మొయినుద్దీన్,రచనశ్రీ పాల్గొంటారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, నవంబర్ 27, ప్రభాతవార్త**
నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ 23వ డివిజన్‌లో సీసీ రోడ్డు పూర్తిగా పాడువటంతో తీవ్ర ఇబ్బంది గురువాతున్న కాలనీ వాసులు గత నెల నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి సదరు కమీషనర్‌తో మాట్లాడి కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా సిసి రోడ్ నిర్మాణానికి మంజూరు చేయించి, పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రారంభోత్సవంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని గురువారం ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, ఎన్ఎంసి మహిళ అధ్యక్షురాలు కడియాల ఇందిరా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండలపు రమేష్, గోలి శ్రీనివాస్, గోలి విజయ లక్ష్మి, నవ్య, రాణి, అనుపమ, జ్యోతి, సతీష్ మహిళ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్షలాది నిధులతో అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సున్నం

**అఫ్జల్‌గంజ్,నవంబర్ 27 ప్రభాతవార్త:** స్థానిక ప్రజలే నాణ్యత విషయంలో అభివృద్ధి పనులను పరిశీలించుకోవాలని పురానాపూల్ డివిజన్ పరిధిలోని చిన్నబజార్,కబుతర్‌ఖానా తదితర ప్రాంతాలల్లో అభివృద్ధి పనులను పురానాపూల్ డివిజన్ మజ్లీస్ కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా వర్షం నీటి కాలువలు, డ్రైనేజీ పైపులైన్‌లో పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని ఎత్తివేయించారు.దాదాపుగా 20 ఏళ్లుగా కోట్లాది రూపాయల వివిధ అభివృద్ధి పనులను స్థానిక ఎంపి,శాసన సభ్యులు సహకారంతో చేపట్టడం జరిగిందన్నారు.పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు.కార్యక్రమంలో మజ్లీస్ నాయకులు పాల్గొన్నారు.

**వృద్ధుడి హత్య కేసులో ఇద్దరు యువకుల అరెస్ట్**

**చార్మినార్,నవంబరు 27 ప్రభాతవార్త :** డబ్బులు ఇవ్వనందుకు ఓ వృద్ధుడిని హత్య చేసిన కేసులో ఇద్దరు యువకులను హుస్సేనీఆలం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు .హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కథనం ప్రకారం.....సిటీ కళాశాల చౌరస్తా తాటి మైసమ్మ దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న తానాజీ (54) ఈ నెల 17వ తేదీ రాత్రి రోడ్డు ప్రక్కన నిద్ర పోతున్నాడు.అదే సమయంలో కాగితాలు ఏరుకునే చాంద్రాయణగుట్ట ఆషామాబాద్‌కు చెందిన మెహరాజ్ (22) జాఫర్ (23)లు సిటీ కళాశాల చౌరస్తా వద్దకు వచ్చారు.రహదారి ప్రక్కన నిద్ర పోతున్న తానాజీని వారు డబ్బులు ఇవ్వాలని అడిగారు.తానాజీ డబ్బులు ఇవ్వకపోవటంతో బండరాయితో తానాజీ తలపై మోదటంతో అక్కడకక్కడే మృతి చెందాడు.పరారీలో ఉన్న మెహరాజ్,జాఫర్‌ను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును హుస్సేనీఆలం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పనిచేసే సంస్థలో రూ. 2 కోట్ల చేతివాటం

**- ఎస్ఐఎస్‌పీఎల్ సంస్థ అకౌంట్స్ ఎజీఎంపై కేసు నమోదు**

**బంజారాహిల్స్, నవంబర్ 27, ప్రభాతవార్త:**
పనిచేసే సంస్థలో దాదాపు రూ. 2 కోట్ల చేతివాటాన్ని ప్రదర్శించిన ఒక సంస్థ అకౌంట్స్ ఏజీఎంపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఎస్ఐఎస్‌పీఎల్ సంస్థలో ఎంకేవీ ప్రసాదరావు అకౌంట్స్ విభాగ అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. కాగా ఇటీవల సంస్థలో ఆడిట్ నిర్వహించగా ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు దాదాపు రూ. 2.06 కోట్లకు సంబంధించి లెక్క తేలలేదు. ఈ డబ్బులను ఏజీఎం దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. జీతం బిల్లులు, విక్రేత బిల్లులు, కొనుగోలు పత్రాలను నకిలీవి తయారు చేయడం ద్వారా ఆయా డబ్బులను సంస్థకు చెందిన యాక్సిస్ బ్యాంకు ఖాతా నుండి ఏజీఎంకు సంబంధించిన కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించినట్లు గుర్తించారు. అతని అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఈ మోసపూరిత లావాదేవీలకు పాల్పడినట్లు సంస్థ హెచ్ఆర్ రాజేష్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కొనడానికి వచ్చి కొట్టేసుకెళ్లారు...

**బంజారాహిల్స్, నవంబర్ 27, ప్రభాతవార్త:**
ఆభరణాల దుకాణానికి వచ్చిన ముగ్గురు మహిళలు దుకాణంలోని ఆభరణాలతో మాయమైన సంఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. ఫిలింనగర్ పోలీసుల కథనం ప్రకారం.. షేక్‌పేటలోని ఓయూ కాలనీలో ఉన్న సుజనీ జువెలరీకి ముగ్గురు గుర్తు తెలియని మహిళలు దుకాణానికి కొనుగోలు దారులుగా వచ్చారు. అక్కడున్న చెవి పోగులను దొంగిలించి వాటి స్థానంలో వారు తీసుకొచ్చిన నకిలీ చెవి పోగులను పెట్టారు. అనంతరం గుర్తించిన దుకాణ నిర్వాహకుడు సుధీర్ యలమంచలి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు 10 గ్రాముల ఆభరణాలను చోరి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నవమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కంపౌండర్ వైద్యుడయ్యాడు

**- నకిలీ వైద్యుడిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**బంజారాహిల్స్, నవంబర్ 27, ప్రభాతవార్త:** చేసేది ఒక ఆసుపత్రిలో కంపౌండర్ పని.. కాని సాయంత్రం వేళ నకిలీ వైద్యుడి అవతారం ఎత్తి వైద్యుడిగా చలామణి అవుతున్నాడు. అలాంటి ఒకరిని మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. యాదగిరినగర్ ప్రాంతానికి చెందిన అన్నమదాస్ రామకృష్ణ(42) రహమత్‌నగర్‌లోని అశోక్‌రావు ఆసుపత్రిలో కంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. కాగా రమమత్‌నగర్‌లో సాయిజనార్ధన క్లీనిక్ పేరుతో చాలా రోజులుగా రామకృష్ణ ఎలాంటి అనుమతులు లేకుండా వైద్యుడిగా కొనసాగుతున్నాడు. వచ్చిన రోగులకు ప్రిస్క్రిప్షన్ ప్యాడ్‌పై మందులు రాస్తూ చికిత్సను అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రామకృష్ణను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ప్రిస్క్రిప్షన్ ప్యాడ్, స్టాంప్, వైద్య యంత్రాలు, మాత్రలు, ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**వ్యాపారి ఇంట్లో వజ్రాభరణాల హారం మాయం**

**బంజారాహిల్స్, నవంబర్ 27, ప్రభాతవార్త:**
బంజారాహిల్స్‌లో ఒక వ్యాపారి ఇంట్లో దాదాపు రూ. 2.50 లక్షల వజ్రాలహారం చోరికి గురైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లో వ్యాపారి పెరియాల సాకేత్ రామారావు నివసిస్తారు. అతని భార్య ఇంట్లో పెట్టిన వజ్రాల హారం కనిపించలేదు. దీంతో ఇంట్లో పనిచేస్తున్న పనిమనుషులైన శారద, సునీత, అలివేలుపై అనుమానం వ్యక్తం చేస్తూ అతను బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో పడకగదిలో పెట్టిన వజ్రాల హారం కనిపించలేదని, పనిమనుషులు తప్ప ఇంట్లోకి ఎవరూ వచ్చే అవకాశం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. చోరికి గురైన హారం విలువ రూ. 2.50లక్షలు ఉంటుందనన్నారు. సాకేత్ రామారావు ఫిర్యాదుపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులు అరెస్ట్**

**14 గ్రాముల ఎండిఎంఎ స్వాధీనం**

**మాదాపూర్, నవంబర్ 27, ప్రభాతవార్త :**
మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన సంఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిదిలో గురువారం చోటుచేసుకుంది. మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం వనస్థలిపురంకి చెందిన ఇద్దరు మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో మాదకద్రవ్యాలు విక్రయిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. గతంలో వీరిద్దపై పలు పోలీసు స్టేషన్లలో డ్రగ్స్ కేసులు నమోదు అయినట్టు తెలిపారు. బెంగుళూరు నుంచి వచ్చిన 14 గ్రాముల ఎండిఎంఎను స్వాదీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సత్తి రెడ్డి నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



**మల్కాజిగిరి వంబర్ 27, ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని సత్తి రెడ్డి నగర్ లో స్థానికుల పిలుపు మేరకు కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులు రోడ్డు సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బాక్స్ డ్రైన్ పనులు పూర్తయ్యాయని రోడ్డు పనులకు 33 లక్షల శాంక్షన్ కావడం జరిగింది త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలపడం జరిగింది ఈ కార్యక్రమంలో డి ఈ లౌక్య వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్, కాలనీవాసులు బలవంత రెడ్డి రాజు దేవేందర్ సిద్దేశ్వర ఆంటోనీ చారి సరోజమ్మ భాగ్యమ్మ కిషోర్ పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి కృషి : కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న నమ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్ పేట, నవంబర్ 27, ప్రభాతవార్త:** ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ లోని గడ్డి అన్నారం బస్తీలో రూ .10 లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణం పనులను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి ముసారాంబాగ్ డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రతినిత్యం డివిజన్ లోని పలు ప్రాంతాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్స్పెక్టర్ సత్తిరెడ్డి, కాలనీవాసులు సామా మల్లారెడ్డి, పరశురాం నాయక్, ప్రభాకర్, శ్రీధర్, జీవన్, హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల అభ్యున్నతి కోసం కృషి : ఎమ్మెల్యే బలాల



లబ్ధిదారులకు సాలార్ పక్వాన్ గ్యాస్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ సలాం షాహిద్ తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 27, ప్రభాతవార్త:** మలక్ పేట నియోజకవర్గ ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నామని నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. చావుని డివిజన్ షా కాలనీలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బలాల ముఖ్యఅతిథిగా హాజరై డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిద్ తో కలిసి పలువురు లబ్ధిదారులకు సాలార్ పక్వాన్ గ్యాస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడాల మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు అధిక సంఖ్యలో పలువురికి సాలార్ పక్వాన్ గ్యాస్ లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసిన కాకతీయ నగర్ కాలనీ సంఘం ప్రతినిధులు



**నేరెడ్ మెట్, నవంబర్ 27,ప్రభాతవార్త :** మల్కాజ్గిరి సర్కిల్ పరిధిలోని 137 డివిజన్ పరిధిలో ఉన్న కాకతీయ నగర్ (దక్షిణ, తూర్పు) కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంఘ ప్రతినిధులు గురువారం బోయిన్‌పల్లి శిబిర కార్యాలయంలో శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డిని కలిసారు. ఈ సందర్భంగాకాలనీ అభివృద్ధి, రహదారుల మరమ్మత్తులు, నీటి సరఫరా, పారిశుధ్య సమస్యలు, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, త్వరితగతిన పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చినట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి బద్దం పరుశురాం రెడ్డి, కాలనీ సంఘం అధ్యక్ష-కార్యదర్శులు దశరథ్, శ్రీహరి, గుత్తి రామచందర్, దయానంద్, మోహన్ కుమార్, సత్యనారాయణ, ప్రసాద్, రాజు,బీఆర్ఎస్ నాయకులు సురేష్, బాలకృష్ణ, శ్రీనివాస్ యాదవ్, సాయి ముదిరాజ్, రమేష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎన్ రెడ్డి నగర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 27 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ ఎస్ఎన్ రెడ్డి నగర్ ఫేజ్ 1లో రూ.21.76 లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలని, రోడ్డు నిర్మాణం సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు మురళీధర్‌రావు, కృష్ణారావు, ఆనంద్, జగన్ రెడ్డి, పెంటయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీపీ ప్లాంటు తరలించే వరకు పోరాటం : ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



ఉప్పల్ కురుమనగర్ ఎస్టీపీ ప్లాంట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 27 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ కురుమనగర్‌లో నిర్మిస్తున్న ఎస్టీపీ ప్లాంటును మరో ప్రాంతానికి తరలించే వరకు పోరాటం ఆపేది లేదని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం బిజెపి ఆధ్వర్యంలో కురుమనగర్ ఎస్టీపీ ప్లాంటు వద్ద పలువురు పార్టీ నేతలు, కాలనీవాసులతో కలిసి భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఎస్టీపీ ప్లాంటు వద్దకు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో భగాయత్‌లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగని కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అమృత పథకం నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటుందని, ఎస్టీపీ కెపాసిటి పెంచాలని, ప్లాంటు వద్ద కురుమనగర్, ఉప్పల్‌హిల్స్, లక్ష్మినగర్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్లాంటు నిర్మాణం సాంకేతికపరమైన తప్పిదమని, దీని వల్ల భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు వస్తాయని ఆయన పేర్కొన్నారు. జలమండలి ఎండి అశోక్‌రెడ్డి తనను చర్చలకు రావాలని పిలిచారని, ప్లాంటు దూరంగా తరలించాలని విన్నవించినట్లు తెలిపారు. కురుమనగర్ వద్ద ప్రస్తుతం ప్లాంటు నిర్మిస్తున్న స్థలం వద్ద కింద, పైన కాలువలు లేవని, అయినప్పటికి ప్లాంటు నిర్మాణం అంచనా వ్యయం పెంచేందుకే ఇక్కడ ప్లాంటు ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. మూసీ కాలువకు దగ్గరగా తీసుకెళ్లి నిర్మించే అవకాశం ఉందని, ప్లాంటు తరలించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఉప్పల్ నల్ల చెరువు సుందరీకరణ పూర్తి చేయలేదని, కొత్తగా మరో ప్లాంటు ఎలా ఏర్పాటు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా పోలీసులకు, బిజెపి నేతలకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు మహంకాళి లక్ష్మన్, దేవసాని బాలచందర్, రావుల బాలకృష్ణగౌడ్, జి.శ్రీనివాసాశర్మ, బండారు వెంకట్రావ్, రెడ్డిగారి దేవేందర్‌రెడ్డి, ఎల్లగోని ప్రకాష్‌గౌడ్, సింగారం కార్తీక్, కొల్లు బాలరాజు, వర్కల రాజేందర్‌గౌడ్, బోరంపేట మురళీ, రామరావు, హరిప్రసాద్, బి.రఘుపతిగౌడ్, ఆలే నరేందర్, రామరాజుయాదవ్, పుప్పాల వెంకటేశ్వర్లు, అజయ్‌గుప్త, కురుమనగర్ కాలనీ వాసులు మంగ శోభ, కృష్ణవేణి, నిర్మల, చైతన్య, స్వరూప, భద్రకాళి, సునీత, నవత,లక్ష్మి,అంజలి,శారధ, మంజుల పాల్గొన్నారు.

# అల్మాస్‌గూడ ఓల్డ్ విలేజ్‌లో కాంగ్రెస్ నేతల బృందం పర్యటన

- -పాదయాత్రలు చేస్తూ గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్న నేతలు
- -బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఎఇఇ హరీష్‌తో కలిసి సమస్యల పరిశీలన
- -పాత డ్రైనేజీ, వాటర్ పైప్‌లైన్లు, స్తంభాలు మార్చాలని సూచన



అల్మాస్‌గూడ పాత గ్రామంలో సమస్యల పరిశీలనకు పాదయాత్రల ద్వారా పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు నవారు మల్లారెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, నవంబర్ 27 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 2వ డివిజన్ కిందకు వచ్చే అల్మాస్‌గూడ పాత గ్రామంలో గురువారం కాంగ్రెస్ బృందం పర్యటించింది. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, 24వ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, ఎఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డిలు బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఎఇఇ హరీష్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పాదయాత్రలు చేశారు. ఈ సందర్భంగా సమస్యలను పరిశీలిస్తూ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎఇఇతో చర్చించారు. అదే విధంగా పలువురు గ్రామస్తులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**సమస్యలు చాలా ఉన్నాయి..పరిష్కారానికి కృషి చేస్తాం: నవారు మల్లారెడ్డి**

అల్మాస్‌గూడ పాత గ్రామంలో పాత డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ మూతలు, సరిగ్గా లేని వాటర్ పైప్‌లైన్లు, అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ స్థంభాల సమస్యలు ఉన్నాయని కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డి తెలిపారు. వీటి వల్ల ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ముఖ్యంగా ఎప్పుడో దాదాపు 25 సంవత్సరాల క్రితం పాత గ్రామంలో ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థనే ఉందనీ అది శిథిలావస్థలో ఉండడం,, పెరిగిన జనాభాకు అనుగుణంగా తగిన సామర్థ్యం గల డయా పైప్‌లు కాకపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో పాత గ్రామంలో మొత్తం పాత డ్రైనేజీ వ్యవస్థను మార్చి కొత్త లైన్ వేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. అదే విధంగా మంచి నీటి పైప్‌లైన్లను కూడా మార్చాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. దీని వల్ల కలుషిత నీరు సరఫరా సమస్యలు గానీ పైప్‌లైన్ల లీకేజీలు గానీ ఉండకుండా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇక పోతే పాత గ్రామంలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు చాలా చోట్ల ధ్వంసం అయ్యాయనీ దీని వల్ల స్థానికంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున నాణ్యతతో కూడి డ్రైనేజీ మ్యాన్‌హోళ్ళను, పైకప్పులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. పాత గ్రామంలో విద్యుత్ స్తంభాలు సరిగ్గా లేవనీ పలు చోట్ల వాటిని మార్చాల్సిన అవసరం ఉందని ఆయన వెల్లడించారు. గుర్తించిన పాత గ్రామ సమస్యలను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కెఎల్ఆర్ దృష్టికి తీసుకెళ్తామనీ తద్వారా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని మల్లారెడ్డి పాత గ్రామ ప్రజలకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు బోయపల్లి వెంకట్‌రెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, పగడాల మురళి, నందు తదితరులతో పాటు కార్పొరేషన్ వర్క్ ఇన్స్‌పెక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# హిస్టరీ షీటర్లలో మార్పు

## .. రాచకొండ పోలీసుల వినూత్న ప్రయత్నం



**నేరెడ్ మెట్,రాచకొండకమిషనరేట్ నవంబరు 27 ప్రభాతవార్త :** నేరచరిత్ర కలిగినవారిని కేవలం పర్యవేక్షణకే పరిమితం చేసే సాంప్రదాయ విధానానికి భిన్నంగా, రాచకొండ పోలీసులు సంస్కరణాత్మక దిశగా కొత్త అడుగు వేశారు. హిస్టరీ షీటర్లలో మార్పు తీసుకురావడం, వారిని సామాజిక సేవలో భాగం చేయడం లక్ష్యంగా "పరివర్తన" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్ప్రవర్తన చూపిస్తున్న హిస్టరీ షీటర్లను ఎంపిక చేసి.. ఉప్పల్, ఎల్బీనగర్, ఈసీఐఎల్ వంటి ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వాములను చేశారు. వలంటీర్లు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి వీరు వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు సహాయపడడంతో పాటు ప్రయాణికులకు మార్గదర్శనం చేస్తున్నారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో 20 మంది హిస్టరీ షీటర్లు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఇదే తరహాలో ఉప్పల్ పోలీస్ స్టేషన్ నుంచి 20 మంది, ఎల్బీనగర్ స్టేషన్ నుంచి మరో 20 మంది రౌడీ షీటర్లు సేవలు అందించారు. "గతంలో చేసిన తప్పులు మాకు తెలుసు. కానీ ఇప్పుడు ప్రజలకు ఉపయోగపడే అవకాశం రావడం గర్వకారణం" అని ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు తెలిపారు. సమాజం తమను తిరస్కరించిన పరిస్థితి నుండి, ప్రజలకు సేవ చేసే స్థాయికి రావడం కొత్త జీవితానికి నాంది పలికిందని పేర్కొన్నారు. సంస్కరణలో భాగంగా మరిన్ని హిస్టరీ షీటర్లను కూడా ఇలాంటి కార్యకలాపాల్లో భాగం చేయాలన్నది రాచకొండ పోలీసుల లక్ష్యం. సమాజం సానుకూల మార్పు దిశగా సాగేందుకు పోలీసులు వంతు పాత్ర పోషిస్తారని, చిన్న మార్పు కూడా ఒక కొత్త జీవితం దిశగా తీసుకెళ్తుంది" అని రాచకొండ సీపీ సుధీర్‌బాబు పేర్కొన్నారు. రాచకొండ పోలీసుల ఈ అడుగు నేరచరిత్రున్నవారిలో నమ్మకం పెంపుతో పాటు, వారిని సక్రమ జీవనానికి దారితీసే ప్రయోగంగా నిలిచింది.

# రాచకొండలో మహిళల భద్రతకు పటిష్టమైన చర్యలు

**- 15 రోజుల్లో 110 మంది వేధింపులకారుల పట్టివేత**




**నేరెడ్ మెట్,రాచకొండ కమిషనరేట్, నవంబర్ 27,ప్రభాతవార్త :** రాచకొండ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్నామని రాచకొండ కమిషనర్ జి. సుధీర్ బాబు తెలిపారు. మహిళలను వేధించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ విడిచిపెట్టబోమని, మహిళలు భయపడకుండా ఫిర్యాదు చేయాలని సూచించారు. బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో నిలయాలు, పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్లు వంటి జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో మఫ్టీలో తిరుగుతూ ప్రత్యేక గమనికలు, నకిలీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. మహిళలను వెంబడిస్తూ, చెడుగుణాలకు పాల్పడుతున్న వారిని ధృవీకరణతో గుర్తించి కోర్టుకు హాజరుపరుస్తున్నామని తెలిపారు. రాచకొండ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో రాచకొండ శిబిర కార్యాలయంలో వేధింపులకు పాల్పడిన వారిపై బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎల్‌బి నగర్ మహిళా భద్రత కార్యాలయంలో మొత్తం 110 మంది (పెద్దవారు 74, చిన్నవారు 36) కి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు డీసీపీ ఉషారాణి తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మొత్తం 135 ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. వాటిలో ఫోన్ ద్వారా 34, సామాజిక మాధ్యమాల ద్వారా 48, నేరుగా వేధింపులకు 53 ఫిర్యాదులు నమోదు అయినట్లు తెలిపారు. విశేష కేసులు- ప్రయాణికులపై దాడి చేసిన అద్దె వాహన డ్రైవర్‌పై కేసు- సామాజిక మాధ్యమాలలో మహిళను వేధించిన వ్యక్తి అరెస్టు- వేర్వేరు నంబర్ల నుంచి కాల్‌లు చేసి యువతిని ఇబ్బంది పెట్టిన వ్యక్తి అరెస్టు- తుక్కుగూడ ఉద్యానవనంలో అల్లరి చేసిన యువకుడిని మహేశ్వరం మహిళా భద్రత బృందం అదుపులోకి తీసుకోవడం అవగాహన కార్యక్రమాలుఈ నెల మొదటి పక్షంలో మొత్తం 49 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 7,481 మందికి మహిళా హక్కులు, చట్టాలు, భద్రత చర్యలు, అప్రమత్తతపై అవగాహన కల్పించినట్లు అధికారులు తెలిపారు. మెట్రో రైలులో తనిఖీలుమహిళలకు మాత్రమే కేటాయించిన బోగీల్లో ప్రయాణించిన ఎనిమిది మంది పురుషులను పట్టుకుని మెట్రో సిబ్బందితో జరిమానాలు విధింపజేసినట్లు వివరించారు.

**తక్షణ ఫిర్యాదు చేయాలి**

వేదింపులు ఎదురైన వెంటనే రాచకొండ మహిళా భద్రత బృందానికి 8712662111 నంబర్ ద్వారా లేదా ప్రాంతాల వారీగా క్రింది నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

| | |
|---|---|
| భువనగిరి | - 8712662598 |
| చౌటుప్పల్ | -8712662599 |
| ఇబ్రహీంపట్నం | -8712662600 |
| కూషాయిగూడ | - 8712662601 |
| ఎల్‌బినగర్ | - 8712662602 |
| మహేశ్వరం | - 8712665299 |
| మల్కాజగిరి | - 8712662603 |
| వనస్థలీపురం | - 8712662604 |
| యాదాద్రి | - 8712665300 |

కార్యక్రమంలో డీసీపీ ఉషారాణి, ఏసీపీ పల్లె వెంకటేశ్వర్లు, అధికారులైన ముని, అంజయ్య, రాజు, భద్రత సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు : రజితరెడ్డి



ఉప్పల్ కుమ్మరిబస్తీలో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 27 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్‌లో రూ.12 కోట్ల వ్యయంతో సిసి రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతు న్నామని స్థానిక కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం డివిజన్ పరిధిలోని కుమ్మరిబస్తీలో డిఇ వెన్నెలగౌడ్, ఎఇ రాజ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి తదితరులతో కలిసి పర్యటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు చేపడుతున్నామని తెలిపా రు. ఉప్పల్ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సల్ల ప్రభాకర్‌రెడ్డి, మాశెట్టి రాఘవేంద్ర, మీనంపల్లి ఆండాలు,పొట్లూరి రమేష్, గుమ్మడెల్లి రాజేందర్, కన్నమైన నరేష్, గుమ్మడెల్లి కిషోర్, కుమ్మరి సాయి, పొట్లూరి నవీన్, పొట్లూరి లింగం, గిరి, శ్రీకాంత్, బాలు ,సాయి పాల్గొన్నారు.

# నేటి అవసరాలకు తగ్గట్లుగా యుజిడి నిర్మాణం

## - కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి



యుజిడి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, నవంబరు 27 ప్రభాతవార్త:** సైదాబాద్ బస్తీలోని మూడుగుళ్ల నుండి దోభిఘాట్ వరకు రూ.13లక్షల వ్యయంతో నిర్మించనున్న యుజిడి పనులను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ డివిజన్‌లో అవసరమైన చోట పాత యుజిడి స్థానంలో నేటి అవసరాలకు తగ్గట్లుగా నూతనంగా యుజిడి నిర్మాణం చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

# అయ్యప్ప మాల వేసుకున్న ఎస్ఐకి మెమో జారీ చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన

**సైదాబాద్, నవంబరు 27 ప్రభాతవార్త:** కాంచన్‌బాగ్‌లో అయ్యప్ప మాల వేసుకున్న ఎస్ఐ కృష్ణకాంత్‌కు ఉన్నతాధికారులు మెమో జారీ చేయడాన్ని నిరసిస్తూ గురువారం అయ్యప్ప మాలధారులతో పాటు బిజెపి, బిజెవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పోలీసుల శాఖ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఎస్ఐకి జారీ చేసిన మెమోను వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అయ్యప్ప మాల వేసుకుంటే సెలవు పెట్టుకోవాలని పోలీసు అధికారులు పేర్కొనడం దారుణమని అన్నారు. అయ్యప్ప మాలధారులపై ఆంక్షలు విధించడం సరికాదని, రాజ్యాంగం అందరికి సమానమైన హక్కులు కల్పించిందన్నారు. హోంశాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి ఈ విషయంలో వెంటనే స్పందించి పోలీసు శాఖకు తగిన ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు. అనంతరం డిసిపి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రమణ గురుస్వామి, బాలకృష్ణ గురుస్వామి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కూసూరు సహదేవ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సోమనాథేశ్వరస్వామి ఆలయ ధ్వజ స్థంభ ప్రతిష్టాపన



రామంతాపూర్‌లోని శ్రీ సోమనాథేశ్వరస్వామి ఆలయం ధ్వజ స్థంభం ప్రతిష్టాపనలో పాల్గొన్న ఉత్సవ సమితి నేతలు

**రామంతాపూర్, నవంబరు 27 ప్రభాతవార్త :** రామంతాపూర్ శ్రీనివాసపురం కాలనీలోని శ్రీ సోమనాథేశ్వరస్వామి ఆలయం ధ్వజ స్థంభం ప్రతిష్టాపన మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థాన కమిటి అధ్యక్షుడు బైరోజు రామస్వామి, ప్రధాన కార్యదర్శి యాలల వెంకటేశంచారి, కోశాధికారి వేములవాడ నరసింహాచారి, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు నాగారం శ్రీనివాసాచారి, కాడపర్తి రామచంద్రచారి, కోశాధికారి గోవిందారం కోటేశ్వర్‌చారి తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు, విశ్వకర్మ సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో గురువారం ఉదయం సుప్రభాతసేవ, ఉపనవిషత్ పారాయణం, ధ్వజ స్థంభ యంత్ర పంచామృత అభిషేకం,వాస్తు పర్యగ్నీకరణ, గర్తన్యాస, రత్నన్యాస, బీజన్యాస పూజలు, మహాపూర్ణహుతి, వేద మంత్రి విశ్వపార్థన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి ప్రతి ఒక్కరు చేయూత అందిస్తున్నారని పేర్కొన్నారు. దాతలు కందుకూరి బాలకిషన్ ఆచార్యులు, ధనలక్ష్మి, సోమేశ్వర్, భానుశ్రీ, లింగంపేట ప్రకాష్‌చారి, పుష్పలత, సంతోష్‌కుమార్, స్రవంతి సహకారంతో ధ్వజ స్థంభం ప్రతిష్టాపన చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు, భక్తులు పాల్గొన్నారు.

# శరవేగంగా ఉప్పల్ నల్ల చెరువు సుందరీకరణ పనులు.!

## మరో మూడు నెలల్లో పూర్తి : సుందరంగా ముస్తాబు



శరవేగంగా సాగుతున్న ఉప్పల్ నల్ల చెరువు సుందరీకరణ పనులు దృశ్యం.

**ఉప్పల్, నవంబరు 27 ప్రభాతవార్త :** ఉప్పల్ నల్లచెరువు కబ్జా కోరల్లో నుంచి అభివృద్ధి వైపు దూసుకెళుతోంది. గతంలో చెరువు అభివృద్ధి చేస్తున్నామని పలుమార్లు ప్రకటనలు చేసినా ఆచరణకు నోచుకోలేదు. ఇటీవల హైడ్రా అధికారులు నల్ల చెరువు సుందరీకరణకు శ్రీకారం చుట్టడంతో పనులు శరవేగగా సాగుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ నుంచి వరంగల్‌కు వెళ్లే జాతీయ రహదా రిపై ఉన్న నల్లచెరువు సుమారు 64 ఎకరాల పరిధిలో విస్తరించి ఉంది. అయితే చెరువు స్థలం చుట్టూ పట్టా భూములు ఉన్నాయి. చెరువు శిఖం పరిధిలో ఉన్న భూములను మార్పు చేసేందుకు వీలు లేదు. అయితే చెరువు స్థలం సమీపంలో యధేచ్ఛగా కబ్జాలు జరుగుతున్నాయి. చెరువు సమీపంలోని భూముల యజమానులు చెరువు బఫర్ జోన్ హద్దులు తొలగించి నిర్మాణాలు చేస్తున్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో నల్లచెరువును రూ.40 లక్షల వ్యయంతో నెదర్లాండ్ నిధులతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. దీంతో అప్పట్లో కొందరు భూ యజమానులు కోర్టుకు వెళ్లడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. పలుమార్లు పెన్సింగ్ వేసినా ఫలితం చెరువు కబ్జాలు ఆగలేదు.

**శరవేగంగా హైడ్రా ఆధ్వర్యంలో పనులు :**

ఉప్పల్ నల్ల చెరువు సుందరీకరణ చేసేందుకు హైడ్రా అధికారులు పనులు చేపట్టారు. గత ఏడాది నుంచి పనులు సాగుతున్నాయి. పలుమార్లు చెరువులో నీటిని బయటికి పంపించి పనులు చేపట్టారు. ప్రస్తుతం చెరువు ఒక వైపు బండ్ నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన వైపు పనులు సాగుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పలు జెసిబిలు, టిప్పర్లతో చెరువు బండ్ వేసే పనులు సాగుతున్నాయి. హైడ్రా అధికారుల ప్రత్యేకంగా అక్కడే తిష్టవేసి పనులు పర్యవేక్షిస్తున్నారు. చెరువు పనులు మరో మూడు నెలల్లో పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.